సేవలందక.. బోసిపోయిన సచివాలయాలు

ఎర్రగుంట్ల : మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్ద పీట వేశారు. ప్రజల వద్దకే పాలన ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి దేశ చరిత్రలో సరికొత్త విప్లవాన్ని తీసుకువచ్చారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామంలోని సచివాలయాల్లో అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. కానీ కూటమి ప్రభుత్వం అంతకంటే మరింతగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ కల్లిబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను పక్కనపెట్టి ప్రజల సేవలకు కోతలు పెట్టింది. అధికారంలోకి వచ్చిన 9 నెలలవుతున్నా ఒక్క ప్రభుత్వ పథకం అందక.. సచివాలయాల్లో సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవతున్నారు. ప్రజలకు అవరసమైన రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్య



చిలంకూరు గ్రామంలోని గ్రామ సచివాయలం

శ్రీ, కార్డులు, అన్నదాత సుఖీభవ వంటి వైబ్‌సైట్లు ఇప్పటికీ తెరుకున్న పాపాన పోలేదు. ప్రజలు ప్రసుత్తం కుల, ఆదాయ ధ్రువపత్రాలు, వన్‌బీ వంటి సాధారణ సేవలు మాత్రమే పొందుతున్నారు. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సేవలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ప్రజల పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్లెల్లోనే సేవలు అందించేందుకు ప్రతి గ్రామంలోనూ సచివాలయాన్ని ఏర్పాటు చేసి అనుసంధానంగా 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి అన్ని సేవలను ప్రజలకు నేరుగా అందజేశారు. ఒక్కో సచివాలయ భవనాన్ని రూ.45 లక్షలు వెచ్చించి నిర్మించారు. ప్రజలకు తమకు వీలున్నప్పుడే సమస్యలను విన్నవించుకునేందుకు సచివాలయాలు ఎంతో ఉపయోగపడేవి. సంక్షేమ పథకాలతో పాటు విద్య వైద్యం, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ తదితర సేవలు వివిధ ధృవీకరణ పత్రాలు ఆస్తుల రిజిస్ట్రేషన్లు ఆధార్ సేవలు, పల్లెల్లోనే పొందేవారు. ప్రసుత్తం కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు కనిపించడం లేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలు వెలవెలబోయాయి. ఇప్ప టికే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను సైతం తగ్గిస్తోంది.

పట్టించుకునే వారే లేరు

గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు విస్తృతమైన సేవలు అందేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హాయాంలో సచివాయాలన్నీ దిష్టిబొమ్మల్లా మారాయి. ఎన్నికలలో చెప్పిన హామీలను ఇప్పటి వరకూ అమలు చేయలేదు. గతంలో వలంటీర్లు ఇంటికి వచ్చి సంక్షేమ పథకాల సేవలు అందించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. – తమ్మిశెట్టి బాలయ్య, జెడ్పీటీసీ, ఎర్రగుంట్ల



ఏ పథకం అందడం లేదు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు అయినా ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదు. రేషన్ కార్డులతో పాటు పింఛన్ దరఖాస్తు వైబ్‌సైటు తెరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. సచివాలయాలన్నింటిని ఈ కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది.

– డి.సూర్యనారాయణరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు, ఎర్రగుంట్ల



విశ్వహిందూ పరిషత్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

ఎర్రగుంట్ల : కడప రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణం నుంచి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ స్థాపించి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ నాలుగు రోడ్ల కూడలి వరకు సాగింది. అనంతరం మార్కెట్ యార్డులో సమావేశం నిర్వహించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎర్రగుంట్ల : పట్టణంలో నిర్మాణంలో ఉన్న టీడ్కో ఇళ్లకు, నూతనంగా నిర్మిస్తున్న ఎన్టీఆర్(జగనన్న కాలనీ)లోని ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నాయకుడు ఎంబీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం కాలనీలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాలనీలో రోడ్లు, కరెంట్, కాలువలు, శ్మాశన వాటికలు కల్పించాలని డిమాండ్ చేశారు.

గంగమ్మా.. చల్లంగ చూడమ్మా

కమలాపురం : గంగమ్మ.. మమ్మల్ను చల్లగ చూడవమ్మా అంటూ భక్తులు స్థానిక మార్కెట్ వీధిలో వెలసిన శ్రీ గంగమ్మతల్లిని వేడుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచే కాక సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గంగమ్మకు బోనాలు తీసుకొచ్చి చల్ల ముద్దలు ఏర్పాటు చేసి, జంతు బలులు ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు ఇంటికి చేరి ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మహిళా భక్తులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కోగటం, కంచన్నగారిపల్లె, ఎర్రగుడిపాడు, సి.గోపులాపురం తదితర గ్రామాలలో ప్రజలు ఘనంగా ముద్దల పండుగ చేసుకున్నారు. బంధువులు, సన్నిహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పోట్లదుర్తి గ్రామంలో ఉగాది పండుగను పురష్కరించుకుని ముందుగా ఆదివారం పెద్దమ్మతల్లి చలవ ముద్దల పండుగ జరుగుతుంది. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి చలవ ముద్దను మహిళలు ఉత్సవంగా దేవాలయానికి తీసుకువచ్చి పెద్దమ్మతల్లికి సమర్పిస్తారు. అలాగే కేజీవీపల్లె, ఇల్లూరు గ్రామాలలో ఆదివారం జరిగిన అమ్మవార్ల దేవర సందర్భంగా రెండు గ్రామాలలో మాజీ



పోట్లదుర్తి గ్రామంలో పెద్దమ్మతల్లికి చలవ ముద్దలను తీసుకుని వస్తున్న మహిళలు

ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని నాగాయపల్లె, కారపురెడ్డిపల్లె, కొండూరు, కొత్తసంగటిపల్లె, మర్రిమాకుల పల్లె, రేపల్లె, పగడాలపల్లె, చెన్నంరాజుపల్లె, గంగులయ్యగారిపల్లె, మాచునూరు తదితర గ్రామాల్లో ప్రజలు ముద్దల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గ్రామదేవతలు గంగమ్మ, అంకాలమ్మ, పోలేరమ్మలకు భక్తులు పూజలు చేసి ఇళ్లల్లో చల్లముద్దలు ఏర్పాటు చేసుకొని జంతువులను బలి ఇచ్చి విందు భోజనాలు అరగించి బంధు మిత్రులతో సంతోషంగా గడుపుకున్నారు. మాచునూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరారెడ్డి, చెన్నంరాజుపల్లెలో నాగేశ్వర్ రెడ్డిలు ఏర్పాటు చేసిన విందుకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి హజరైయ్యారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి జాతరకు ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని శాకాంభరీదేవి అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులను చెల్లించుకున్నారు. అమ్మవారికి బోనాలు, జంతుబలులు ఇచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే ఆలయ సమీపంలోని వీరభద్రస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలలో పూజలు చేశారు.



కమలాపురం : విశేష అలంకారంలో గంగమ్మతల్లి



సీకేదిన్నె : శాకాంభరీదేవి అలంకారంలో గంగమ్మతల్లి

క్రికెట్ బుకీలకు కౌన్సెలింగ్

ప్రొద్దుటూరు క్రైం: క్రికెట్ బుకీలకు వన్ టౌన్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రికెట్ బుకీలను స్టేషన్‌కు పిలిపించి సీఐ రామకృష్ణారెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. పందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని, మ్యాచ్‌లు ఉన్న సమయంలో అందరూ స్టేషన్‌కు రావాలని హెచ్చరించారు.

పైపులను కోసేసిన గుర్తుతెలియని వ్యక్తులు



పైపును కోసేసిన గుర్తు తెలియని వ్యక్తులు

పులివెందుల రూరల్ : మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి తోటలోని నీటి పైపులను గుర్తుతెలియని వ్యక్తులు కోసేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తన పొలంలోని పంటకు నీరు అందించడానికి ఏర్పాటు చేసిన పైపులైన్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో కోసేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో పంటలకు నీరు అందించే పైపులను ఇలా కోసివేయడం ఏమిటని ఆయన ప్రశ్నిస్తున్నాడు.

ఎంబార్కేషన్ పాయింట్‌ను రద్దు చేయడం దుర్మార్గం

వేంపల్లె : పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్లే విజయవాడ ఎంబార్గేషన్ పాయింట్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మునీర్ బాషా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో పవిత్ర హజ్‌యాత్ర చేయడానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హజ్ యాత్రీకులు హైదరాబాద్, బెంగళూరుల నుండి వెళ్లేవారని అయితే అప్పటి డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్లే హజ్ యాత్రికుల సౌకర్యార్థం కోసం ఎంబార్కేషన్ పాయింట్ రాష్ట్ర నడిబొడ్డున ఉన్న విజయవాడ కేంద్రంగా ఉండాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరడం జరిగిందన్నారు. ఆయన ఆదేశానుసారం డిప్యూటీ సీఎం, హజ్ కమిటీ చైర్మన్ అప్పటి కేంద్ర ఏపీ షియన్ మంత్రి స్మృతి ఇరానీకి పలుమార్లు కలవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంవల్ల విజయవాడకు పాయింట్ ఇవ్వడం జరిగిందన్నారు. ముస్లింలు పట్ల కూటమి ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. ముస్లింలకు తోడుగా అండగా నిలిచే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలని ప్రతి ముస్లిం కోరుకుంటున్నారన్నారు.

గంగమ్మ జాతరలో భక్తుల జేబులకు చిల్లు

కడప కార్పొరేషన్: గంగమ్మ జాతరను ఆసరాగా తీసుకుని ఆలయ సిబ్బంది, దేవాదాయ శాఖ అధికారులు భక్తుల జేబులకు చిల్లులు వేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ గుడిలో ఏటా మార్చిలో గంగమ్మ జాతర జరుగుతుంది. భక్తులు వందల సంఖ్యలో తరలివచ్చి జంతుబలులు ఇచ్చి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకుంటారు. భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో కొంతమంది దాతలు గదులు నిర్మించి ఫ్యాన్లు వేయించారు. భక్తులకు గతంలో వీటిని నామమాత్రపు ధరలకు అద్దెకిచ్చారు. ఇటీవల దేవాదాయశాఖ వాటిని స్వాధీనం చేసుకోవడంతో పరిస్థితులు మారిపోయాయి.

ఆ ఇన్విజిలేటర్ల తీరు.. ప్రైవేటుకు లబ్ధి

ముద్దనూరు : పదవ తరగతి పరీక్షల్లో కొంతమంది ఇన్విజిలేటర్లు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ముద్దనూరులో రెండు కేంద్రాల్లో పది పరీక్షలు జరగుతున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులై ఇన్విజిలేటర్లుగా నియమితులైన వారు ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు లబ్ధి చేకూరేలా వారు వ్యుండటంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, తల్లితండ్రులు వారి తీరుపై ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ ఆ ఇన్విజిలేటర్లు ఓ ప్రైవేటు పాఠశాలలో కనిపిస్తున్నారన్నారు. ఇది అనుమానాస్పదంగా వుందని ప్రభుత్వ విద్యార్థుల తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల పట్ల పది పరీక్షల్లో ఆ ఇన్విజిలేటర్లు తీరు వివాదంగా మారకముందే విద్యాశాఖాధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ధర్మవరంకు చెందిన మానస నృత్య కళా కేంద్రం, చంద్ర డ్యాన్స్ స్టూడియో సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, జానపద, శాస్త్రీయ, సినిమా పాటలకు చిన్నారులు వేసిన నృత్యాలు అందరిని అలరించాయి. సందర్శకులు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ మానస, ఫీల్డ్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్ సాహేబ్, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారులు



శాస్త్రీయ నృత్యంలో చిన్నారులు

ఘనంగా చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు

వల్లూరు : మండలంలోని వెంకటాపురం వీవర్స్ కాలనీలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి, గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. చౌడేశ్వరీదేవి పులి వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించబడిన వాహనంలో అమ్మవారి గ్రామోత్సవం అత్యంత ఘనంగా సాగింది. గ్రామోత్సవంలో అమ్మవారికి ముందు మహిళలు నీటిని వారపోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. కాయ కర్పూరాలు సమర్పించి బలిదానాలను ఇచ్చారు. గ్రామోత్సవం వెంట 12 జ్యోతులతో జ్యోతి ఉత్సవం వైభవంగా జరిగింది. భక్తులు జ్యోతులను తలలపై పెట్టుకుని అమ్మవారి పాటలకు అనుగుణంగా విన్యాసాలను చేశారు. పలువురు యువకులు చేసిన వివిధ రకాల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

దుగ్గాయపల్లెలో ఉత్సవాలు ప్రారంభం

దుగ్గాయపల్లెలో చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చౌడేశ్వ



వెంకటాపురం వీవర్స్ కాలనీలో గ్రామోత్సవంలో చౌడేశ్వరీ దేవి అమ్మవారు

రీదేవి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం గ్రామంలో చల్ల కార్యక్రమం నిర్వహించారు. జ్యోతులను మొక్కుబడుల రూపంలో సమర్పించనున్న భక్తులు ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి జ్యోతుల తయారీని ప్రారంభించారు.



జ్యోతుల ప్రదర్శన

పలు గ్రామాల్లో జాతర

మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ దేవతలైన గంగమ్మ, మాతమ్మ మొదలైన అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా బంధు మిత్రులతో గృహాలు కళ కళలాడాయి. స్వగ్రామమైన దుగ్గాయపల్లె జాతర కార్యక్రమంలో ఏపీఎస్ఆర్‌టీసీ మాజీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ఆయన సతీమణితో కలిసి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

నేడు గంగమ్మ జాతర

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎస్.పాలగిరి గ్రామంలో రెండు రోజుల పాటు గంగమ్మతల్లి జాతర నిర్వహించనున్నారు. జాతరకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. జాతర సందర్భంగా పట్టణాల్లో ఉన్న బంధువులు, కుటుంబ సభ్యులు గ్రామానికి చేరుకోవడంతో ప్రతి ఇల్లు కళ కళ లాడుతోంది. సోమవారం వేకువ జామున్నే గంగమ్మతల్లి ప్రతిమను ప్రతిష్ఠంచడంతో పాటు అమ్మవారికి బోనాలు, జంతు బలులు సమర్పిస్తారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సిరి బండి ఉత్సవం నిర్వహించనున్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

వేముల : మండలంలోని వేల్పుల గ్రామంలోని మసీదులో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి, మాజీ సర్పంచ్ లింగాల పార్వతమ్మల ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, మండల పరిశీలకుడు రామలింగారెడ్డిలు ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ విందుకు 1500 మంది ముస్లింలు హాజరయ్యారు. అలాగే వేల్పుల గ్రామానికి చెందిన ముస్లిం మహిళలకు పండుగ సందర్భంగా బట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాబ్‌జాన్, వైఎస్సార్‌సీపీ దూదేకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మసీదులో ప్రత్యేక ప్రార్థనలలో వైఎస్ మధురెడ్డి, లింగాల రామలింగారెడ్డిలు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ఎర్రగుంట్ల : పట్టణంలోని 6వ వార్డు క్రాంతినగర్ కాలనీలో రోడ్డుకు మధ్యలో ఇళ్ల నడుమ ఉన్న విద్యుత్ స్తంభాలు వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించిన ప్రయోజనం లేదని ఆ వార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి తెలిపారు. రోడ్డు మధ్యలో 220 కేవీ విద్యుత్ లైన్ ఉందన్నారు. ఇటీవల షార్టు సర్క్యూట్ జరిగి ఓ బాలుడికి తీవ్ర గాయాలైయ్యాయి. అయినా అధికారులు స్పందించాలేదన్నారు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలో కూడా ఈ విషయంపై ప్రస్తావించినట్లు కౌన్సిలర్ తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆయన కోరారు.



6 వార్డులోని క్రాంతినగర్ కాలనీలో ప్రమాదకరంగా రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

క్లుప్తంగా

టీసీసీ టౌన్ చర్చికి నూతన పాస్టర్ల నియామకం



పాస్టర్లను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కమలాపురం : పట్టణంలోని టీసీసీ టౌన్ చర్చికి ఇద్దరు కొత్త పాస్టర్లు నియమించబడ్డారని చర్చి కార్యదర్శి కొర్రపాడు సుధీర్ తెలిపారు. తెలుగు చర్చి కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శుల ఉత్తర్వు మేరకు టీసీసీ టౌన్ చర్చి సంఘంనకు రెవ. మధుబాబును టౌన్ చర్చి పాస్టర్‌గా, ఎం. మహిమాను సహాయ పాస్టర్‌గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న రెవ. ఎం .దేవదాస్‌ను కమలాపురం డివిజనల్ చైర్మన్ (ఇన్‌చార్జ్)గా బదిలీ చేశారు. ఆదివారం నూతన పాస్టర్లుగా నియమింపబడిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంఘం నియమ నిబంధనలను పాటించి సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

నేలకూలిన మొక్క జొన్న పంట



గాలికి నేలకూలిన మొక్క జొన్న పంట

లింగాల : లింగాలలో శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మొక్క జొన్న పంట నేలకూలింది. ప్రతాప్‌రెడ్డి సాగు చేసిన 5 ఎకరాలలోని మొక్క జొన్న పంట నేలకూలిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మొక్క జొన్న పంట కోత దశకు చేరుకుందని, ఈ దశలో పంట నేలకూలడంతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతు వాపోతున్నాడు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.


నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : వేంపల్లి జెడ్పీటీసీ ఎం.రవికుమార్ రెడ్డి కుమారుడు వివాహ రిసెప్షన్ వేడుకల్లో కడప ఎంపీ అవినాష్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు. ఆదివారం వేంపల్లి కడప రోడ్డులోని మధురెడ్డి కల్యాణ మండపంలో వివాహ రిసెప్షన్ వేడుకలు జరిగాయి. నూతన వధూవరులు భైరవ ప్రీతంరెడ్డి, వైష్ణవిరెడ్డి దంపతులను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజాద్‌బాషా, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పూల శ్రీనివాసులు, బైరెడ్డి సిద్దార్థరెడ్డి, వరప్రసాద్, చిన్నప్ప, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, మునీర్‌బాషా, తుషార్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ హాజీవలి

పులివెందుల రూరల్ : మైనర్లకు వాహనాలు ఇస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ హాజీవల్లి తెలిపారు. పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి వాహనాలను నడుపుతున్న మైనర్లను పట్టుకుని సీజ్ చేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ లేకుండా నడపడం, ర్యాష్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడప రాదన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ శేషఫణి

ఎర్రగుంట్ల : పట్టణంలోని రాజీవనం కాలనీలోని రైల్వేస్టేషన్ క్రాస్ రోడ్డు వద్ద మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ శేషఫణి ప్రారంభించి మాట్లాడారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో ఈ చలివేంద్రం చాలా ఉపయోగపడుతుందన్నారు. అలాగే మానవత అధ్వర్యంలో కే జ్యోతి అనే విద్యార్థి ఆపరేష్ నిమిత్తం రూ.5000లు, అలాగే మానవత మండల శాఖ మాజీ అధ్యక్షుడు కే గంగాధర్‌రెడ్డి రూ.5000లు మొత్తం రూ.10 వేలను ఆ విద్యార్థికి అందించారు. 20వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్అలీ, మానవత సభ్యులు పాల్గొన్నారు.